క్లుప్తంగా

నేడు మెగా వైద్యశిబిరం

మైలవరం: మైలవరం పొందుగల రోడ్డులోని శ్రీ రాజా ఎస్వీఆర్‌జీ నరసింహారావు జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందని చెప్పారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సౌజన్యంతో నిర్వహించే శిబిరంలో వివిధ వ్యాధుల వైద్య నిపుణులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారన్నారు. మైలవరం పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి



మైలవరం: బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలల్లోనే ఉండాలని మైలవరం 6వ వార్డులోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. గోపాల్ అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా అందరూ చదవాలి, అందరూ ఎదగాలి అనే నినాదంతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న ప్రారంభమైన నేను బడికి పోతా కార్యక్రమం జూలై 25వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. ఐదు నుంచి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలు బడిలో ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉంటారని చెప్పారు. పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్ రావు, శ్రీలక్ష్మి, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ మాజీ చైర్మన్‌కు సన్మానం



ఎ.కొండూరు: పోలిశెట్టిపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డిని పీఏసీఎస్ సీఈఓ పి. కోటేశ్వరరావు, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో శనివారం ఘనంగా సన్మానించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ గత మూడేళ్లుగా సంఘ అభివృద్ధికి సహకారం అందించిన మాజీ చైర్మన్ సేవలు కొనియాడారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల వేతనాలు చెల్లించాలి

విస్సన్నపేట: ఉపాధి హామీ పథకం కూలీలకు చెల్లించాల్సిన బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. విస్సన్నపేటలో ఉపాధి పని ప్రదేశంలో శనివారం ఆయన కూలీలతో కలిసి మాట్లాడారు. ఉపాధి కూలీలకు వేతనాలు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని నాగరాజు కోరారు.

కనుమూరు సొసైటీలో నూరు శాతం రుణాల వసూలు



కనుమూరు(గంపలగూడెం): మండలంలోని కనుమూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో 2023–24 సంవత్సరానికి నూరు శాతం రుణాలు వసూలయ్యాయి. వరుసగా రెండో ఏడాది సొసైటీలో రుణాలు నూరు శాతం వసూలయ్యాయి. ఈ సందర్భంగా గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ సీఈఓ షేక్ హుస్మాన్, పీఏసీ బి. స్టాలిన్‌లను మేనేజర్ శ్రీనివాసరావు అభినందించారు. నూరు శాతం రుణాల రికవరీకి సహకరించిన రైతులకు మేనేజర్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా సొసైటీలో ఈ ఆర్థిక సంవత్సరంలో మెంబర్ లెవల్‌లో 1,220 మంది రైతుల నుంచి రూ.17.69 కోట్లు వసూలు కావాల్సి ఉండగా పూర్తిగా వసూలయ్యాయి. సూపర్‌వైజర్ మల్లాది ఏసోబు, మేనేజర్ కనకదుర్గ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

4న మామిడి రైతులు, అధికారులతో సమావేశం

నూజివీడు: నూజివీడు పరిసర ప్రాంతాల్లోని రైతులకు, వ్యాపారస్తులకు ఉపయోగపడే విధంగా మామిడి మార్కెట్ ఏర్పాటు, మామిడి ఎగుమతులకు గల అవకాశాలపై చర్చించేందుకు జూలై 4వ తేదీన నూజివీడు మార్కెట్ యార్డ్‌లో సమావేశం ఏర్పాటు చేశామని ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడు, ఆగిరిపల్లి, విసన్నపేట, తిరువూరు, మైలవరం, ముసునూరు, చాట్రాయి, రెడ్డిగూడెం, నున్న, ఎ. కొండూరు పరిసర ప్రాంత మామిడి రైతులు, మామిడి ఎగుమతిదారులు సమావేశంలో పాల్గొనాలన్నారు. సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొంటారన్నారు. మామిడి రైతులు, వ్యాపారులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కేసుల రాజీతో సమయం, డబ్బు ఆదా

- 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ
- జాతీయ లోక్ అదాలత్‌లో 148 కేసుల పరిష్కారం



నూజివీడు లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి నాగశైలజ

నూజివీడు: లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పునకు అప్పీలు ఉండదని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ అన్నారు. పట్టణంలోని 15వ అదనపు జిల్లా కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామన్నారు. కక్షిదారులు క్షణికావేశంలో చేసిన తప్పులకు కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరగడం వల్ల విలువైన సమయం, ధనం వృథా అవుతాయని చెప్పారు. కక్షిదారులంతా లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కె. హరిబాబు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు, స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, రూరల్ సీఐ రామకృష్ణ, పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

148 కేసుల పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్‌లో మోటర్ వెహికల్ కేసులు 6, సివిల్ కేసులు 20, క్రిమినల్ కేసులు 104, చెక్ బౌన్స్ కేసులు 9, వివాహ సంబంధ కేసులు 6 , ప్రీ లిటిగేషన్ కేసులు మూడు చొప్పున మొత్తం 148 కేసులు పరిష్కరించారు. మోటర్ వెహికల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులకు కలిపి మొత్తం రూ.1.17 కోట్లు వసూలయ్యాయి.

మైలవరంలో 57 కేసుల పరిష్కారం



మైలవరం లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి శివపార్వతి, న్యాయవాదులు

మైలవరం: మైలవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 57 కేసులను పరిష్కరించామని జడ్జి శివపార్వతి తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పిలుపు మేరకు మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మైలవరం కోర్టు పరిధిలో లోక్ అదాలత్ నిర్వహించారు. రాజీ పడటానికి అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్, మనోవర్తి, బ్యాంక్ కేసులను రాజీ చేసుకుని సమయం, డబ్బు ఆదా చేసుకున్న కక్షిదారులను జడ్జి అభినందించారు. కార్యక్రమంలో మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీ ప్రసాద్, వీటీ కిశోర్, సీనియర్ న్యాయవాదులు, మైలవరం సర్కిల్ పరిధిలోని ఎస్‌లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరు లోక్ అదాలత్‌లో 77 కేసుల పరిష్కారం..



తిరువూరు: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ ఆధ్వర్యంలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. జడ్జి మోతిలాల్ నాయక్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అదాలత్‌లో 40 క్రిమినల్ కేసులు, 18 సివిల్ కేసులు,11 నెగోషి యబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం కేసులు, 8 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కక్షిదారులు పాల్గొన్నారు.

ప్రతి రోజూ పాఠశాలలను తనిఖీ చేస్తా

ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



తిరువూరు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యా ప్రమాణాల మెరుగుకు ప్రతి రోజూ తాను ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేస్తానని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. తిరువూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన జరిగింది. గంపలగూడెం, ఎ.కొండూరు కస్తూరిబా గాంధీ పాఠశాలలను తాను ఇప్పటికే తనిఖీ చేశానని, పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులకు తగు ప్రోత్సాహకాలు అందిస్తానని చెప్పారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి పీఎంజీఎస్‌వై నిధులు మంజూరు చేయిస్తానని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను సర్పంచులు సిద్ధం చేయాలని సూచించారు. తిరువూరు మండలంలోని గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు విద్యా శాఖ చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సూచించారు. రహదారులు, డ్రైయినేజీల నిర్మాణం, తాగునీటి సరఫరాకు నిధులు కేటాయించాలని, విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మరమ్మతులో అధికారులు అలసత్వ ధోరణి అవలంబిస్తున్నారని సర్పంచులు ఫిర్యాదు చేశారు. ఆంజనేయపురం, లక్ష్మీపురం, ముష్టికుంట్ల గ్రామాల సర్పంచులు మామిడి కుటుంబరావు, గొల్లమందల శ్రీనివాసరావు, గొల్లమందల కోటయ్య, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

విస్సన్నపేట: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి వి. నాగరాజు విజ్ఞప్తి చేశారు. సామాజిక ఆరోగ్యకేంద్రంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు శనివారం సూపరింటెండెంట్ పావనికి వినతిపత్రం అందజేశారు. వారు ఆయన మాట్లాడుతూ ఎనిమిది మంది వైద్యులు అవసరం కాగా ఆరుగురు వైద్యులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. కొంతమంది వైద్యులు సమయపాలన పాటించకపోవడం, రోగుల పట్ల దురుసుగా వ్యవహరించడం, సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందుబాటులో ఉన్నా రోగులను నూజివీడు, విజయవాడకు రిఫర్ చేస్తున్నారని ఆరోపించారు. రోగులకు స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలోనే మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, మండల కమిటీ సభ్యుడు ఏడుకొండలు, రామకృష్ణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

కాలువ పూడికతీత పనులు ప్రారంభం

తిరువూరురూరల్: మండలంలోని జీకొత్తూరు–గానుగపాడు గ్రామాల నడుమ విప్లవాగు సప్లయ్‌చానల్ పూడిక తీత పనులను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్‌లో విప్లవాగు నుంచి సాగునీటిని సరఫరా చేసే సప్లయ్ చానల్స్ పూర్తిగా శిథిలమవగా, నీటిపారుదలకు వీలుగా మరమ్మతు చేయించాలని రైతులు కోరారు. పొక్లెయిన్‌తో కాలువలో జంగిల్ క్లియరెన్స్ చేసే పనులను చేపట్టారు.

కల్యాణ మండపం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శేషాచల శ్రీనివాసస్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణానికి భక్తుడు శనివారం రూ.లక్ష విరాళాన్ని ఇచ్చారు. విజయవాడ సమీపంలోని పోరంకికి చెందిన కోలా రామారావు, కళావతి దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జొన్నల ప్రతాపరెడ్డికి అందజేశారు. దాత దంపతులను అర్చకులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.

దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్ల నిరసన



నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు

మైలవరం: రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన నాన్ జుడీషియల్ స్టాంప్‌లు మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని మైలవరం సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని స్టాంప్ వెండర్‌లు, దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వినియోగదారులు విజ్ఞప్తి చేశారు. శనివారం స్టాంపు వెండర్లు, దస్తావేజు లేఖరులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు కొద్ది సేపు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని మైలవరం సబ్ రిజిస్ట్రార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ–స్టాంప్‌లు వినియోగంలో ఉన్నాయని, వీటి వలన ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ బ్రహ్మం, జె. వెంకటేశ్వరరావు, జేవీఎల్ నారాయణ, బి.సుభాషిణి, కె. అనూరాధ, పి. శ్రీలక్ష్మి, బి. మేఘన పాల్గొన్నారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ దేవరకొండ భూషణం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువు ఉందని చెప్పారు. దీంతో పాటు ఈనెల 30 నుంచి జూలై 25 తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకువచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు పనివేళల్లో ప్రభుత్వ ఐటీఐ కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

2న క్యాంపస్ ఇంటర్వ్యూలు

పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శిక్షణ పొందిన చివరి ఏడాది విద్యార్థులకు, ఐటీఐ పూర్తి చేసిన వారికి జూలై 2న క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ దేవరకొండ భూషణం తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని మంగళవారం ఉదయం 9 గంటల కల్లా ఐటీఐ కళాశాలలో హాజరు కావాలని చెప్పారు.

ఘనంగా జాతీయ కెమెరా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఇబ్రహీంపట్నం: జాతీయ కెమెరా దినోత్సవం ఇబ్రహీంపట్నం మండల యువత ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నల్లమోతు రత్నకుమార్ అధ్యక్షతన కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఆయన మాట్లాడుతూ కాలగర్భంలో కలిసిపోతున్న చరిత్రను సజీవంగా నిలిపేది ఫొటోగ్రఫీ అని అన్నారు. ఫొటోగ్రఫీ కొందరికి వినోదం అయినప్పటికీ తరతరాలుగా ఎందరికో జీవనాధారంగా నిలిచిందని చెప్పారు. ఫొటోగ్రఫీలో వినియోగదారులకు ఒకే రేట్లు వర్తించేలా యూనియన్ తరఫున చర్యలు తీసుకుంటామన్నారు. సభ్యులు చిన్న, నాగాచారి, ఖాశిం, రమేష్, రాజశేఖర్, పెద్దబాబు, నాగమల్లేశ్వరరావు, నరసింహారావు పాల్గొన్నారు.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిల నియామకం

చాట్రాయి: మండలంలోని ప్రాథమిక సహకార సంఘాలకు ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. చాట్రాయి ప్రాథమిక సహకార సంఘానికి సాల్మన్‌రాజు, బూరుగుగూడెం, చిన్నంపేట, చనుబండ సంఘాలకు చంద్రబాబు, తుమ్మగూడెం, నరసింహారావుపాలెం, పోలవరం సొసైటీలకు అబ్దుల్ సలీంలను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి నూతన కార్యవర్గం ఎన్నిక ఐడీఏలోని ఐలా కార్యాలయంలో శనివారం జరిగింది. జిల్లా గవర్నర్ లయన్ జేఎస్ శంకర్‌గుప్తా ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా రేగళ్ల రఘునాథరెడ్డి, కార్యదర్శిగా లయన్ సురేష్, కోశాధికారిగా లయన్ జాకీర్ హుస్సేన్ ఎన్నికయ్యారు. లయన్ శంకర్‌గుప్తా మాట్లాడుతూ తోటి వారికి సహాయ పడటమే లయనిజం అని అన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా ఇప్పటికే చేపట్టిన వివిధ సేవలను కొనియాడారు. నూతన సభ్యులతో పాటు శంకర్‌గుప్తాను సత్కరించారు. డిస్ట్రిక్ చైర్‌పర్సన్ బి.కృష్ణారెడ్డి, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎంపీ రామలింగేశ్వరరావు, బుల్లిరాజుచౌదరి పాల్గొన్నారు.

డ్రైయినేజీలో తాగునీటి పైప్‌లైన్

ఇబ్రహీంపట్నం: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని వీధిలో రోడ్డు మధ్యలో ఉన్న డ్రైయినేజీలో ఆర్‌డబ్ల్యూఎస్‌కు చెందిన పైప్‌లైన్ ఏర్పాటు చేయడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు, డయేరియా ప్రబలుతున్న సమయంలో ప్రధాన పైపులైన్ డ్రైయినేజీలో వదిలేసి అధికారులు నిర్లక్ష్యం వహించారని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తక్షణమే తాగునీటి పైప్‌లైన్ సమస్య పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమోతు ప్రసన్నబోసు, దయాకర్, స్థానికులు కోరుతున్నారు.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారం

తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు



మండల పరిషత్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం: అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయపరచి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తానని తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గంపలగూడెం మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను గుర్తించేందుకు ప్రతి నెలా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో రెండు సార్లు పర్యటిస్తానన్నారు. నెమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టి విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని, గ్రామంలోని దళితవాడలో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవన నిర్మాణం చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యులు కె. శామ్యూల్ సూచించారు. సొబ్బాల గ్రామంలో డ్రైయినేజీ సమస్య గ్రామస్తులను దీర్ఘకాలంగా వెంటాడుతోందని, తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సర్పంచ్ ఉన్నం కృష్ణారావు కోరారు. గంపలగూడెం సర్పంచ్ కోట పుల్లమ్మ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన రహదారిలో డ్రైయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, శ్మశానవాటిక సమస్య, డంపింగ్ యార్డు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని సమస్యల పరిష్కారానికి తగిన నిధులు మంజూరుకు ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. తహసీల్దార్ డి.సుగుణ, ఎంపీడీఓ పి. నాగేశ్వరరావు, ఏఓ సాయిశ్రీ, తిరువూరు సీడీపీఓ సత్యవతి, వివిధ శాఖల అధికారులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. కాగా మండల పరిషత్ సమావేశానికి ఎక్కువ మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకాలేదు.

విద్యార్థులకు కిట్‌ల పంపిణీ

మండలంలోని తోటమూల కేజీబీవీలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఎంఈఓ పీవీఎల్ నరసింహారావు, కేజీబీవీ ప్రత్యేక అధికారి వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

కౌన్సిలర్ల వినతి



సమావేశంలో కౌన్సిలర్ల వాగ్వివాదం

తిరువూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వార్డుల్లో మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని తిరువూరు నగర పంచాయతీ కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. శనివారం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు డ్రైయినేజీ సమస్యపై చర్చించారు. 15వ వార్డులో దీర్ఘకాలంగా రోడ్లపైనే మురుగునీరు నిలిచిపోతోందని, వర్షాలు పడితే ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ తెలిపారు. 18వ వార్డులో డ్రైయినేజీ సమస్యను ఎన్నిసార్లు నగర పంచాయతీ అధికారులకు తెలియజేసినా చర్యలు తీసుకోవట్లేదని కౌన్సిలర్ దారా నీలిమ పేర్కొన్నారు. 9వ వార్డులో తాగునీటి పైపులు తరచూ పగిలిపోయి నీరు వృథాగా పోతోందని, పైపు లైన్లు లీకేజీ అవుతున్నాయని, డంపింగ్ యార్డుకు ప్రహరీ లేక చెత్త చుట్టుపక్కల నివాసగృహాలు, పొలాల్లోకి ఎగిరి పడుతోందని కౌన్సిలర్ దుర్గారావు తెలిపారు. పలు సమస్యలపై అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు వాగ్వివాదానికి దిగారు. కమిషనర్ లోవరాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం హేమలత

నూజివీడు: నూజివీడు సబ్ జోన్ వ్యాయామోపాధ్యాయుల సమావేశం పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. హైస్కూల్ హెచ్ఎం బి. హేమలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ విద్యా సంవత్సరంలో మండల స్థాయిలో ఆటల పోటీలను ఎక్కడ నిర్వహించాలి అనే అంశంపై చర్చించారు. దీనిలో భాగంగా నూజివీడు మండల స్థాయి ఆటల పోటీలను పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో, చాట్రాయి మండల స్థాయి ఆటల పోటీలను మర్లపాలెం హైస్కూల్‌లో, ముసునూరు మండల స్థాయి ఆటల పోటీలను ముసునూరు హైస్కూల్‌లో, ఆగిరిపల్లి మండల స్థాయి ఆటల పోటీలను ఆగిరిపల్లి హైస్కూల్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో సబ్ జోన్ అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి సుగుణరావు, కోశాధికారి సతీష్, నాలుగు మండలాల్లోని వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వాహనాలకు అడ్డాగా బస్టాండ్



బస్టాండ్ ఆవరణలో నిలిపిన ప్రైవేటు వాహనాలు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి బస్టాండ్ ప్రైవేట్ వాహనాలకు అడ్డాగా మారింది. బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాలను నిలపరాదనే నిబంధనలు ఉన్నా ప్రైవేట్ వాహనదారులు పట్టించుకోవడం లేదు. బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వాహనాలనునిలపడంతో ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి రావడం లేదని, దీంతో బస్టాండు ఆవరణ వెలుపలికి వెళ్లి బస్సులు ఎక్కాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వాహనాలు నిలుపుతున్నా ఆర్టీసీ అధికారులు స్పందించకపోవడం దారుణమని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ముసునూరు: సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా పని చేయాలని మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి యలమంద అన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి షకీనా ఇవాంజిలిన్ అధ్యక్షతన స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. వర్షాలు ప్రారంభమైన దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి వేగంగా పూర్తి చేయాలన్నారు. దోమల నివారణకు అవసరమైన సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రత్నకుమారి, మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు అందజేత



లక్ష్మీపురం(విస్సన్నపేట): కలగర పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వల్లభనేని గిరి సహకారంతో ఆయన తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, రాణి చేతుల మీదుగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగరాజు, సీఆర్పీ సుందరరావు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ఎ.కొండూరు: మండల పరిధి కోడూరు గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో శనివారం సర్పంచ్ టి. సురేష్ విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పాలని ఉపాధ్యాయులకు సూచించారు.